సాక్షి
వైఎస్సార్ జిల్లా

గురువారం । 31 । ఆగస్టు । 2023



చేనేతకు ఆప్కో చేయూత

చేనేతల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోంది. తాజాగా వినియోగదారులకు వేర్వేరుగా ఆప్కో ద్వారా రాయితీలు ఇచ్చేందుకు రెండు పథకాలను ప్రభుత్వం ప్రవేశపెట్టింది. -8లో



గల్ఫ్‌యానం.. గగనం!

తిరుపతి నుంచి అంతర్జాతీయ స్థాయిలో విమాన సర్వీసులు ప్రారంభమవుతాయన్నది కలగానే మిగిలిపోతోంది. రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించినా కేంద్రం కనికరించలేదు. -8లో..

గరిష్టం/కనిష్టం
32.2/25.6

వాతావరణం

జిల్లాలో బుధవారం 25.6 – 32.2 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 7.4 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

యువత అవకాశాలను అందిపుచ్చుకోవాలి

కడప కోటిరెడ్డిసర్కిల్: నిరుద్యోగ యువత ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఉపాధి కల్పనాధికారి సురేష్ కుమార్ తెలిపారు. భారత వైమానిక దళం ఆధ్వర్యంలో సెప్టెంబరు 15న ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల నిరుద్యోగ యువతకు సికింద్రాబాదులోని బేగంపేట 12 ఎయిర్‌మెన్ సెలెక్షన్ సెంటర్ ఎయిర్‌ఫోర్స్‌లో బహిరంగ నియామక ర్యాలీ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. యువత పాల్గొనాలని సూచించారు.

ప్రకృతిసేద్యం అన్నమయ్య మేనేజర్‌గా రామకృష్ణరాజు



కడప అగ్రికల్చర్: అన్నమయ్య జిల్లా ప్రకృతి సేద్యం ఫుల్ అడిషినల్ చార్జి(ఎఫ్ఏసీ) డిస్ట్రిక్ ప్రాజెక్టు మేనేజర్(డీపీఎం)గా రామకృష్ణరాజును నియమిస్తూ రైతు సాధికారిక సంస్థ సీఈఓ రామారావు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఆయన రేపో మాపో బాధ్యతలు చేపట్టనున్నారు. ఈయన ప్రస్తుతం వైఎస్సార్ జిల్లా రెగ్యులర్ డిస్ట్రిక్ ప్రాజెక్టు మేనేజర్‌గా పని చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నమయ్య జిల్లాలో కూడా ప్రకృతి సేద్య విస్తరణకు కృషి చేస్తానని తెలిపారు.

వేల్పుచర్లలో సదాశివ దేవరాయల శాసనం



వేల్పుచర్లలో గుర్తించిన శాసనం

కడప కల్చరల్ : జిల్లాలోని వేల్పుచర్ల గ్రామంలో సదాశివ దేవరాయల నాటి శాసనాన్ని కడపకు చెందిన పురుషోత్తం గుర్తించారు. ఇది 1545 నాటిదని, ఏప్రిల్ 16న వేయించినట్లు తెలుస్తోందని అర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా, మైసూరు విభాగం ఎపిగ్రఫీ శాఖ డైరెక్టర్ ఆచార్య మునిరత్నంరెడ్డి తెలిపారు. చాగలమర్రి సీమకు చెందిన పట్లవారి ఉప్పలూరు, గండికోట సీమ పరిధిలోని వరద రాజుల దుద్యాల తదితర గ్రామాల ప్రతినిధులు పుష్పగిరి క్షేత్రం, అంకాల పరమేశ్వరీదేవి ఆలయ ముఖ మండపంలో పార్వేటి మహోత్సవ నిర్వహణ కోసమై సమావేశమైనట్లు ఈ శాసనంలో ఉందని వివరించారు.

ప్రయాణికుల సమస్యల పరిష్కారానికి కృషి



ఫోన్‌లో మాట్లాడుతున్న గోపాల్‌రెడ్డి

కడప కోటిరెడ్డి సర్కిల్ : ప్రయాణికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని జిల్లా ప్రజా రవాణాధికారి పోలిమేర గోపాల్‌రెడ్డి తెలిపారు. బుధవారం సాయంత్రం తొలిసారిగా ఆర్టీసీ సమస్యలపై 'డయల్ యువర్ ఆర్ఎం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలు ప్రాంతాల నుంచి ఫోన్‌కాల్స్‌కు ఆయన సావధానంగా సమాధానాలు ఇచ్చారు. ప్రొద్దుటూరు పల్లె వెలుగు సర్వీసులను రామేశ్వరం వరకు పొడిగించాలని కోరగా పోలీసుశాఖ అనుమతి తీసుకుని పరిశీలించాక ఉదయం, సాయంత్రం చదువుకునే పిల్లల కోసం బస్సులను ఏర్పాటు చేస్తామన్నారు. పోరుమామిళ్ల నుంచి వరికుంట్ల వరకు ఉదయం 8.00 గంటలకు బస్సు సర్వీసు నడపాలని ఉపాధ్యాయులు కోరారన్నారు. ఎర్రగుంట్ల నుంచి కడపకు ఉదయం 6.00 గంటలకు బస్సు నడపాలని కోరారు. పామూరు నుంచి కడపకు బస్సు సౌకర్యం కల్పించాలన్నారు. కడప నుంచి ఒంగోలు సర్వీసు, కడప–గాలివీడు సర్వీసును పునరుద్ధరించాలని ప్రజలు కోరారన్నారు. అలాగే బద్వేలు డిపో నుంచి కడపకు నడుస్తున్న ఎక్స్‌ప్రెస్ సర్వీసులు పాత బస్టాండుకు వెళ్లేలా చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరారు. ప్రొద్దుటూరు–ధర్మవరం సర్వీసును సింహాద్రిపురం మీదుగా పునరుద్ధరించాలని, పులివెందుల–శ్రీశైలం ఎక్స్‌ప్రెస్ సర్వీసును అల్ట్రా డీలక్స్‌గా మార్చాలని పలువురు ఫోన్ ద్వారా తెలిపారన్నారు. వీటితోపాటు ఆర్ఎం మరికొన్ని వినతులు స్వీకరించామని.. ఆయా సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

పిసరంత పిట్ట...
పట్టుకునేది ఎట్టా!

- కలివికోడి కోసం కొనసాగుతున్న అన్వేషణ
- విస్తృతంగా గాలించిన బాంబే నేచురల్ హిస్టరీ సొసైటీ
- 25 వాయిస్ రికార్డర్లతో బెంగుళూరుకు చెందిన ఏట్రీ సంస్థ గాలింపు
- కలివికోడి కన్పించకపోవడంతో మూతపడ్డ పరిశోధన కేంద్ర కార్యాలయం
- దశాబ్దాలుగా కొనసాగుతున్న నిరీక్షణ



సాక్షిప్రతినిధి కడప : పిసరంత పిట్ట కోసం దేశవ్యాప్తంగా ఎదురుచూపులు తప్పడం లేదు. ప్రపంచంలో అంతరించి పోతున్న అరుదైన పక్షిజాతుల్లో ఈపక్షి ఉండడమే అందుకు ప్రధాన కారణం. కలివికోడి పూర్తిగా అంతరించి పోయిందనుకున్న తరుణంలో 1986 జనవరి 26న కడప జిల్లా సిద్దవటం రేంజ్ అట్లూరు మండలం కొండూరు బీటు అటవీ ప్రాంతంలో ప్రత్యక్షమైంది. అప్పటినుంచి మొదలైన కలివికోడి కోసం అన్వేషణ ఇప్పటికీ కొనసాగుతోంది. కేంద్ర ప్రభుత్వంచే గుర్తింపు పొందిన బాంబే నేచురల్ హిస్టరీ సొసైటీ సంస్థ ద్వారా కలివికోడి సంతతిని అభివృద్ధి చేసేందుకు శాస్త్రవేత్తలు సిద్ధమైనా పక్షి జాడ కన్పించకపోవడంతో తీరని కోర్కెలాగే మిగిలిపోయింది.

జిల్లాలో 2008లో అట్లూరు, బద్వేలు మండలాలకు చెందిన సుమారు 3వేల ఎకరాలు భూసేకరణ చేపట్టి కలివికోడి అవాసప్రాంత పరిధికి చేర్చుకున్నారు. నిషిద్ధ ప్రదేశంగా గుర్తించి కలివికోడి జీవనానికి ప్రతిబంధకంగా కాకుండా జాగ్రత్త పడ్డారు. 2013లో అట్లూరు మండలం కొండూరు దగ్గర కలివికోడి పరిశోధనా కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. పరిశోధనా కేంద్రం ఆవాసా ప్రాంతంలో అధునాతన కెమె రాలను అమర్చి వాటి ద్వారా కలివికోడి ఉనికి క్షుణ్ణంగా పరిశీలించారు. ఐదేళ్లపాటు నిర్విరామంగా కృషి చేసినా కలివికోడి జాడ కన్పించలేదు. బాంబే నేచరల్ హిస్టరీ సొసైటీ దాదాపు పదేళ్లపాటు కలివికోడి కోసం అన్వేషించింది. 177 కెమెరాలను ఏర్పాటు చేసింది. లంకమల అటవీ ప్రాంతాన్ని జల్లెడపట్టి గాలించినా కలివికోడి జాడ కనిపించలేదు. తాజాగా బెంగుళూరుకు చెందిన అశోక్ ట్రస్ట్‌ఫర్ రీసెర్చ్ ఇన్ ఎకాలజీ అండ్ ఎన్విరాన్‌మెంట్ (ఏట్రీ) అనే సంస్థ అన్వేషణ చేపట్టింది. సిద్దవటం, బద్వేలు మధ్య అటవీ ప్రాంతంలో 25 వాయిస్ రికార్డర్‌లను అమర్చింది. ఉందో లేదో తెలియని కలివికోడి కోసం దశాబ్దాల తరబడి లంకమలలో అన్వేషణ కొనసాగుతూనే ఉంది.

మారిన తెలుగుగంగ అలైన్‌మెంట్...

బద్వేల్ నియోజకవర్గంలో కలివికోడి ఆవాసా ప్రాంతం కారణంగా తెలుగుగంగ కుడి కాలువ అలైన్‌మెంట్ మార్చుకోవాల్సి వచ్చింది. తద్వారా 30వేల ఎకరాల ఆయకట్టు కుదించుకోవాల్సి పరిస్థితి ఏర్పడింది. వాహనాల హారన్ సౌండ్ కారణంగా కలివికోడి జీవనానికి భంగం ఏర్పడుతోందని పొద్దుపోయాక రాకపోకలు బంద్ చేశారు. బద్వేల్ వైపు నుంచి కడప ప్రధాన రహదారిలో రాకపోకలను రాత్రి 9 గంటల నుంచి ఉదయం 6గంటల వరకూ స్తంభింపజేస్తున్నారు. 2013 నుంచి ఇప్పటికీ అదే పరిస్థితి కొనసాగుతోంది. ఆయా ప్రాంతాలకు చెందిన ప్రజానీకం అర్ధాంతర ప్రాణాపాయ బారిన పడిన సమయంలోనూ రాకపోకలు లేక వైద్యసేవలు అందుకోలేని దుస్థితి ఉంది.

పురోగతిలో లేని పుణర్జీవ ప్రాజెక్టు....

అంతరించి పోయిందనుకున్న కలివికోడి ఉనికిని కనుగోనేందుకు 2019లో కేంద్ర ప్రభుత్వం కలివికోడి పునర్జీవ ప్రాజెక్టు మంజూరు చేసింది. ఈప్రాజెక్టు కింద రూ.5.73 కోట్లు నిధులను కూడా కేటాయించారు. అప్పట్లో ఈప్రాజెక్టు 2020–25 వరకూ కొనసాగుతోందని షెడ్యూల్ ప్రకటించారు. గత ఏడాది కలివికోడి పరిశోధకుడు జగన్నాధన్ కలివికోడి పునర్జీవ ప్రాజెక్టు షెడ్యూల్ 2023–27 వరకూ మార్పుచేసినట్లు ప్రకటించారు. ఏడాదిగా ఎలాంటి పురోగతి లేదు. ఉన్న పరిశోధన కేంద్రం మూడేళ్ల క్రితమే మూతబడింది.

కనిపించని జాడ...

దశాబ్దాలుగా అన్వేషణ సాగిస్తున్నా ఇప్పటికీ కలివికోడి జాడ కన్పించలేదు. చరిత్రలోకి వెళ్తే 1848లో బ్రిటీషు సైనిక అధికారి పీసీ జోర్డన్ కలివికోడిని కనుగొన్నట్లు చెబుతున్నారు. అప్పటికే అంతరించిపోతున్న పక్షిజాతిగా దీనిని గుర్తించి జోర్డన్ కోర్సన్‌గా కలివికోడికి నామకరణం చేసినట్లుగా అధికారులు వెల్లడిస్తున్నారు. 1871లో భద్రాచలం నదీ పరివాహక ప్రాంతంలో కలివికోడి కనిపించినట్లు ప్రచారంలో ఉంది. ఆ తర్వాత 1986లో సిద్దవటం అటవీరేంజ్ పరిధిలోని అట్లూరు మండలం కొండూరు ప్రాంతంలో కలివికోడి చనిపోయి కనిపించింది. చనిపోయిన కలివికోడిని తీసుకెళ్లి బాంబేలో భద్రపరిచినట్లు చెబుతున్నారు. అనేక సీసీ కెమెరాలు, వాయిస్ రికార్డర్లు అటవీ ప్రాంతంలో ఏర్పాటు చేసినా కలివి కోడికి సంబంధించిన స్పష్టమైన ఆనవాళ్లు ఇప్పటికీ కనిపించలేదని అటవీశాఖ అధికారులు వెల్లడిస్తున్నారు.

అత్యవసర వైద్యం అందడం లేదు



అట్లూరు మండలంలో రాత్రుల సమయంలో అత్యవసర వైద్య సేవలు కావాల్సి వస్తే తీవ్రమైన ఇబ్బందులకు గురవుతున్నాం. గుండెపోటు లాంటివి తలెత్తితే బద్వేల్ వయా మైదుకూరు మీదుగా జిల్లా కేంద్రానికి చేరాల్సిన పరిస్థితులున్నాయి. ఇలా వైద్యసేవలు సకాలంలో అందకపోడంతో ప్రాణాలు పోగొట్టుకున్న వారు ఉన్నారు. పదేళ్లగా ఇదే పరిస్థితి కొనసాగుతోంది. కనీసం 108 అంబులెన్సులకైనా వెళ్లేందుకు అనుమతిస్తే అట్లూరు ప్రాంత ప్రజలకు ఉపయోగకరం. – పి ఎరుకలయ్య, ఆర్ఎంపీ వైద్యుడు, కుంభగిరి, అట్లూరు మండలం

కలివికోడి పేరు వింటున్నాం.... కానీ కన్పించడం లేదు



కలివికోడి పేరుతో అనేక పరిశోధనలు చేస్తున్నట్లు వింటున్నాం. 35ఏళ్లగా కలివికోడి చూసింది లేదు. అవాసా ప్రాంతం పేరిట 3వేల ఎకరాలు రైతుల భూములు భూసేకరణ చేశారు. తెలుగుగంగ కాలువ అలైన్‌మెంట్ మారింది. 30ఎకరాల ఆయకట్టు బీడుగా మారింది. రాత్రులల్లో వాహనాలు కట్టడి చేశారు. ఇప్పటికీ అదిగో ఇదిగో అంటుండడం తప్పా, తాను కలివికోడిని చూడలేదు, చూస్తానని నమ్మకం లేదు. రోడ్డుకు అటవీ ప్రాంతం నుంచి రోడ్డుపైకి రాకుండా ఇరువైపుల ఇనుప కంచె, రోడ్డుకు అండర్ బ్రిడ్జిలు ఏర్పాటు చేసి, వాహనాలు రాకపోకలు చేపట్టితే చాలా ఉపయోగం. – డి నరసింహారెడ్డి, కొండూరు, అట్లూరు మండలం.

సీడీపీఓలు బాధ్యతగా పని చేయాలి: కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్ విజయరామరాజు

కడప సెవెన్‌రోడ్స్ : ఐసీడీఎస్ అధికారులు సేవా దృక్పథంలో బాధ్యతగా పనిచేయాలని, అలా చేస్తేనే అంగన్వాడీ కేంద్రాలు పటిష్టంగా తయారవుతాయని కలెక్టర్ విజయరామరాజు అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో ఐసీడీఎస్ పీడీ శ్రీలక్ష్మితో కలిసి సీపీడీఓలతో వివిధ అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ సంసంక్షేమ పథకాలను పొందుతున్న ప్రతి లబ్ధిదారు కుటుంబం కూడా అంగన్వాడీ సేవలను పొందేలా చర్యలు చేపట్టాలన్నారు. ప్రణాళిక ప్రకారం ప్రతి సీడీపీవో రోజుకు రెండు చొప్పున వారి పరిధిలోని అన్ని అంగన్వాడీ కేంద్రాలను విధిగా తనిఖీ చేయాలన్నారు. ఎక్కడయినా 18 ఏళ్లలోపు బాలికలకు వివాహం జరిగితే.. వారు తల్లిదండ్రులపై కేసులు ఫైల్ చేయాలన్నారు. వైఎస్ఆర్ జిల్లాను మాతృ మరణాలు లేని జిల్లాగా తీర్చిదిద్దడానికి వైద్య ఆరోగ్య, ఐసీడీఎస్ సిబ్బంది సమన్వయంతో కృషి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని అన్ని ప్రాజెక్టులకు చెందిన సీడీపీవోలు తదితరులు పాల్గొన్నారు.

మహిళలు, చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

గ్రామీణ ప్రాంతాల్లోని గర్భిణీలు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ విజయరామరాజు వైద్యాధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సభా భవనంలో అసిస్టెంట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, డీఎంహెచ్ఓ డాక్టర్ నాగరాజు, పీహెచ్‌సీ వైద్యులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పలు సూచనలు చేశారు. పీహెచ్‌సీల్లో వైద్యులు ప్రతి ఒక్కరూ కూడా నైట్ డ్యూటీ ఖచ్చితంగా చేయాల్సి ఉంటుందని సూచించారు.

వేడుకగా రాఖీ పౌర్ణమి



డిప్యూటీ సీఎం అంజద్‌బాషాకు రాఖీ కడుతున్న మహిళా కమిషన్ సభ్యురాలు గజ్జల లక్ష్మి



కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డికి రాఖీ కడుతున్న బ్రహ్మకుమారీలు

పులివెందుల రూరల్/ కడప కార్పొరేషన్: అనుబంధం తోడుగా.. ఆత్మీయత నీడగా .. రక్షా బంధన్ వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. రాఖీ పూర్ణిమ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా సోదరీమణులు తమ అన్నయ్యలకు రాఖీ కట్టారు. బుధవారం కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డికి పులివెందులకు చెందిన బ్రహ్మకుమారీలు ఆయన నివాసం వద్ద రాఖీ కట్టారు. కుంకుమతో ఆయనను బొట్టు పెట్టి స్వీట్ తినిపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్కా చెల్లెలు, అక్కాతమ్ముళ్ల అనుబంధాలకు ప్రతీక రాఖీ పండుగ అన్నారు. ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజద్‌బాషాకు బ్రహ్మకుమారీలు రాఖీ కట్టి, స్వీట్లు తినిపించారు.రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు. మహిళా కమిషన్ సభ్యురాలు గజ్జల లక్ష్మి, వైఎస్సార్‌సీపీ మహిళా నాయకురాళ్లు పత్తిరాజేశ్వరి, టీపీ వెంకట సుబ్బమ్మ, కార్పొరేటర్ శిరీష, తదితరులు డిప్యూటీ సీఎంకు రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు.

చురుగ్గా లెప్రసీ వ్యాధిగ్రస్తుల గుర్తింపు

కడప రూరల్: లెప్రసీ వ్యాధిగ్రస్తుల గుర్తింపును త్వరితగతిన చేపట్టాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి నాగరాజు తెలిపారు. బుధవారం స్థానిక ఆ శాఖ కార్యాలయంలోని చాంబర్‌లో నేషనల్ లెప్రసీ ఈరియాడికేషన్ ప్రోగ్రాం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లెప్రసీ వ్యాధిగ్రస్తుల గుర్తింపును వేగంగా చేపట్టి అన్ని ఇండికేటర్స్‌లో జిల్లాను రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిచేలా చర్యలు తీసుకోవాలన్నారు.ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ మనోహర్, మెడికల్ ఆఫీసర్ సుబ్బరాయుడు పాల్గొన్నారు.

కార్పొరేట్లకు కేంద్రం ఊడిగం



బద్వేలులో సంతకాల సేకరణను ప్రారంభిస్తున్న సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎంఏ గపూర్

బద్వేలు అర్బన్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్లకు ఊడిగం చేస్తూ పేదల సంక్షేమాన్ని విస్మరించిందని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎం.ఏ.గపూర్ పేర్కొన్నారు. సీపీఎం పోరుబాట కార్యక్రమంలో భాగంగా బుధవారం బద్వేలు, కడప నగరంలో చేపట్టిన సంతకాల సేకరణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. హోదా అంశం మీదనే బీజేపీతో విభేదించాలని చెబుతున్న చంద్రబాబు నాలుగేళ్లలో హోదాపై నోరు మెదపలేదని మండిపడ్డారు. బీజేపీ అధికారం చేపట్టిన మొదలు ప్రజా వ్యతిరేక విధానాలను అమలు చేస్తూ కార్పొరేట్లకు, బడా పెట్టుబడిదారులకు లక్షల కోట్ల రూపాయలు రాయితీలు ఇస్తూ పేద ప్రజలపై పన్నులు భారాన్ని మోపుతోందన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి జీ.చంద్రశేఖర్, పట్టణ కార్యదర్శి శ్రీను, కార్యదర్శివర్గ సభ్యులు చాంద్‌బాష, సీఐటీయూ జిల్లా కార్యదర్శి నాగేంద్రబాబు, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు చిన్ని తదితరులు పాల్గొన్నారు.

మోదీని ఇంటికి పంపుదాం

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ పిలుపు



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

కడప వైఎస్సార్ సర్కిల్/బద్వేలు అర్బన్ : ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న ప్రధాని నరేంద్ర మోదీని ఇంటికి సాగనంపాల్సిన అవసరం ఉందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ పిలుపునిచ్చారు. భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) ఆధ్వర్యంలో దేశాన్ని కాపాడుకుందాం – రాష్ట్రాన్ని రక్షించుకుందాం పేరుతో చేపట్టిన బస్సుయాత్ర బుధవారం జిల్లాకు చేరుకుంది. తొలుత బద్వేలుకు చేరుకున్న యాత్ర అక్కడ సభ అనంతరం సిద్దవటం మీదుగా కడపకు చేరుకుంది.ఈ సందర్భంగా బద్వేలు, కడప పాత కలెక్టరేట్ వద్ద ఏర్పాటు చేసిన బహిరంగ సభలో రామకృష్ణ మాట్లాడారు. దేశంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అన్ని రకాల వ్యవస్థలను భ్రష్టు పట్టిస్తున్నారని తెలిపారు. దేశాన్ని దివాళా తీసే విధంగా వ్యవహరిస్తున్న మోదీని గద్దె దింపేందుకు లౌకిక పార్టీలన్ని ఏకం కావాలన్నారు.

అన్ని రంగాల్లో ముస్లింల వెనుకబాటు

సీపీఐ జాతీయ కార్యదర్శి అజీజ్ పాషా మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ముస్లిం మైనార్టీలపై దాడులు చేస్తూ పాలన చేస్తున్నారని ధ్వజమెత్తారు. అన్ని రంగాల్లో ముస్లింలు వెనుకబడి ఉన్నారన్నారు. వారి సంక్షేమం కోసం కృషి చేయాల్సింది పోయి దాడులు సాగించడం దారుణమన్నారు. పాలక ప్రభుత్వాలు కృషి చేయాలన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జి. ఓబులేసు మాట్లాడారు. అంతకుముందు బద్వేలు పట్టణంలో స్థానిక నెల్లూరు రోడ్డులోని సీపీఐ కార్యాలయం నుంచి నాలుగు రోడ్ల కూడలి వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ దర్శి వర్గ సభ్యులు జి. ఈశ్వరయ్య, జిల్లా కార్యదర్శి చంద్ర, ప్రజా నాట్యమండలి రాష్ట్ర అధ్యక్షుడు పెంచలయ్య, నాయకులు వెంకట శివ, కెసీ బాదుల్లా, బషీరున్నీషా, నాగ సుబ్బారెడ్డి , ఏపీ మండల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు విజయలక్ష్మి, ఏఐటీయూసీ రాష్ట్ర నాయకులు వెంకటసుబ్బయ్య, ప్రజా నాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి చంద్రనాయక్, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శివారెడ్డి, సీపీఐ జిల్లా కార్యదర్శి గాలిచంద్ర తదితరులు పాల్గొన్నారు.

అన్నదాతకు అండగా... సాగుకు సాయంగా

- రైతన్నలకు కిసాన్‌డ్రోన్లు సాయం
- సులభతరం కానున్న పురుగుమందుల పిచికారీ



డ్రోన్ సహకారంతో వరిపంటకు మందులను పిచికారి

కడప అగ్రికల్చర్: రైతు సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోంది. వ్యవసాయం దండగకాదు.. పండుగ అని నిరూపించడమే కాకుండా రైతులకు అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తూ అన్నదాలకు అండగా నిలుస్తోంది. ఇప్పటికే రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులకు పంటల సాగు నుంచి పంటవిక్రయాల వరకు అన్ని రకాల సేవలందిస్తుంది. దీంతోపాటు ఆర్‌బీకేల వారీగా వైఎస్సార్ యంత్ర సేవా పథకాన్ని అమలు చేస్తూ అన్నదాతలకు అత్యాధునిక యంత్ర పరికరాలను అందుబాటులోకి తెచ్చి సాగుకు సాయంగా నిలుస్తోంది. ఇందులో భాగంగా అత్యాధునికి టెక్నాలజీతో పురుగు మందుల పిచాకారి కోసం డ్రోన్లను అందించనుంది. ఇందుకు సంబంధించి 2022–23 సంవత్సరానికి కిసాన్ డ్రోన్‌లను రాయితీపై రైతన్నలకు పంపిణీ చేసేందుకు చర్యలు చేపట్టింది. జిల్లాకు తొలి విడతగా 25 కిసాన్ డ్రోన్లు మంజూరు చేసింది. ఇవి అక్టోబర్ నాటికి అందుబాటులోకి రానున్నాయి.

ఇవీ ఉపయోగాలు...

డ్రోన్‌ల సహకారంతో ఏ కాలంలోనైనా అన్ని పంటలకు క్రిమి సంహారక మందులు పిచికారి చేసేందుకు అనుకూలంగా ఉంటుంది. సులభంగా, వేగంగా పని పూర్తి చేసే వెసులుబాటు ఉంటుంది. ఎత్తుగా ఉండే కంది, మొక్కజొన్న, జొన్న ,సజ్జ, కంది, పత్తిపంటలతోపాటు ఉద్యానపంటలైన మామిడి, సపోట, జామ, అరటి, నేరేడు వంటి తోటల్లో బురద ఉండే వరిపంటల్లో పురుగుముందుల పిచికారికి డ్రోన్లు ఎంతో ఉపయుక్తంగా ఉంటాయి. తక్కువ సమయంలో అధిక విస్తీర్ణంలో పిచికారి చేస్తోంది. దీంతోపాటు తక్కువ మందును ఎక్కువ విస్తీర్ణంలో సమానంగా మందును పిచికారి చేసే అవకాశం కూడా ఉంటుంది. అలాకాకుండా రైతులు స్ప్రేయర్‌లో మందులను పిచికారీ చేయడం ద్వారా ఎక్కువ విస్తీర్ణంలో పిచికారి చేయడం కుదరదు, ఒక్కోసారి ఒక్కో రైతు పురుగుమందులు పిచికారి చేయడం వల్ల తమ పొలంలో ఉన్న పురుగులు పక్కపొలంలోకి వెళ్లపోయే అవకాశం ఉంటుంది. తరువాత అక్కడ నుంచి మళ్లీ ఇక్కడికి వచ్చే అవకాశం ఉంటుంది. అలాకాకుండా డ్రోన్‌లో అందరు కలిసి ఒకే సారి పిచికారి చేయడం వల్ల పురుగు పూర్తిగా నిర్మూలించేందుకు వీలవుతుంది.

విష ప్రభానాకి గురయ్యే ప్రమాదం ఉండదు...

పంటలపై పురుగుముందులు పిచికారి అంటే రైతులకు జీవన్మరణ సమస్య. ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నప్పటికి ఒక్కడో ఒక చోట రైతులు విషప్రభావానికి గురవుతూనే ఉంటారు. ఒక్కోసారి మృత్యువాత కూడా పడే ప్రమాదం ఉంటుంది. కానీ డ్రోన్‌లను వినియోగించడం ద్వారా విషప్రభావానికి గురయ్యే అవకాశం ఉండదు. డ్రోన్‌ల ద్వారా రైతులకు పూర్తి రక్షణ లబిస్తుంది.

జిల్లాకు తొలి విడతలో మంజూరుకానున్న డ్రోన్లు:	25
ఒక్కో డ్రోన్ విలువ :	రూ. 10 నుంచి 12 లక్షలు
ప్రభుత్వం ఇవ్వనున్న రాయితీ:	40 శాతం
జిల్లాలో శిక్షణ పూర్తి చేసుకున్న పైలెట్లు :	17 మంది
శిక్షణను పొందేందుకు సిద్ధంగా ఉన్న పైలెట్లు	12 మంది

తొలివిడతలో 25 డ్రోన్లు....

జిల్లాకు తొలి విడతగా 25 కిసాన్ డ్రోన్లు మంజూరు చేయనున్నారు. తర్వాత రెండవ విడత కింద అవసరం మేరకు ఆదనంగా కేటాయించనున్నారు. ఈ డ్రోన్లను కూడా రైతు భరోసా కేంద్రాలకు అనుబంధంగా ఉన్న సీహెచ్‌సీల పరిధిలోకి తీసుకురానున్నారు. ఇందులో ఒక్కో డ్రోన్ ఖరీదు రూ. 10 లక్షలు కాగా.. పదవ తరగతి, ఇంటర్ చదివిన రైతులకు 40 శాతం, బీఎస్సీ అగ్రికల్చర్ కోర్సు పసూర్తి చేసిన రైతులకు 50 శాతం చొప్పున సబ్సిడీ ఇవ్వనున్నారు. మిగిలిన మొత్తాన్ని బ్యాంకుల ద్వారా రుణం అందించనున్నారు.

శిక్షణ పూర్తి...

డ్రోన్ల నిర్వహణకు ఎంపిక చేసిన పైలెట్లకు శిక్షణను కూడా ఇచ్చారు. ఇందులో భాగంగా మొదటి విడత కింద 17 మంది పైలెట్ల శిక్షణను కూడా పూర్తి చేసుకున్నారు. అలాగే మరో 12 మంది శిక్షణ తీసుకునేందుకు వెయిలింగ్ లిస్టులో ఉన్నారు. వీరికి కూడా త్వరలో శిక్షణను ఇవ్వనున్నారు.

రైతులకు ఎంతో ప్రయోజనం...



వ్యవసాయం పంటలకు పురుగుమందుల పిచికారీలో డ్రోన్లతో ఎంతో ప్రయోజనం ఉంది. సాదారణ పద్ధతుల్లో పిచికారి చేసే మందులకు అవసరమయ్యే నీటిలో 1/4 వంతులోనే ఎకరా విస్తీర్ణంలో పంటపై డ్రోన్ ద్వారా పిచికారి చేయవచ్చు. డ్రోన్‌కు జీపీఎస్‌కు అనుసంధానం ఉండటంతో తక్కువ విస్తీర్ణంలోనూ పిచికారి చేసేందుకు వీలవుతుంది. దీని ద్వారా రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుంది. – అయితా నాగేశ్వరావు, జిల్లా వ్యవసాయ అధికారి, వైఎస్సార్‌జిల్లా

క్లుప్తంగా

వివాహిత ఆత్మహత్య

పెద్దముడియం : మండలంలోని జె.కొత్తపల్లె గ్రామానికి చెందిన వివాహిత తంగెళ్ల బీనా(29) బుధవారం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. పోలీసుల కథనం మేరకు.. జె.కొత్తపల్లె గ్రామానికి చెందిన తంగెళ్ల బీనాకు చాపాడు మండలం మిడుతూరు గ్రామానికి చెందిన వ్యక్తితో ఎనిమిదేళ్ల కిందట వివాహమైంది. వీరికి కుమార్తె ఉన్నారు. మూడేళ్ల కిందట భర్త చనిపోవడంతో తంగెళ్ల బీనా తల్లితండ్రుల వద్దే ఉంటోంది. చిన్నప్పటి నుంచి కడుపునొప్పి తాళలేక మానసికంగా కుంగిపోయారు. బుధవారం ఉదయం ఇంట్లోనే ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. తల్లితండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రామక్రిష్ణ తెలిపారు.

రైలు కింద పడి..

ఎర్రగుంట్ల : యర్రగుంట్ల పట్టణ పరిధిలోని సాయిబాబా ఆలయం సమీపంలో రైలు కింద పడి గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నారని కడప రైల్వే ఎస్ఐ కేఎస్.వర్మ బుధవారం తెలిపారు. మృతుడి వయస్సు సుమారు 35 నుంచి 40 సంవత్సరాలుంటాయని, టీ షర్ట్, నల్లటి లోయర్ ధరించాడని తెలిపారు. మృతుడి వివరాలు తెలియాల్సి ఉందని, ఎవరైనా గుర్తు పడితే 9440900811 చరవాణి సంఖ్యకు వివరాలు తెలియజేయాలని ఆయన కోరారు.



గల్ఫ్ యానం.. గగనం!

ప్రపంచ ప్రఖ్యాత అధ్యాత్మిక నగరం తిరుపతి నుంచి అంతర్జాతీయ స్థాయిలో విమాన సర్వీసులు ప్రారంభమవుతాయన్నది కలగానే మిగిలిపోతోంది. రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించినా కేంద్ర ప్రభుత్వం కనికరించలేదు. దీంతో ఉభయ వైఎస్సార్ జిల్లా నుంచి ఎడారి దేశాలకు విమానాల్లో తిరగవచ్చుననే గల్ఫ్ వాసుల కల నెరవేరడంలేదు.

- గల్ఫ్ విమానాలు రన్‌వే పైకి చేరేదెప్పుడో?
- చెన్నై, బెంగళూరు, ముంబయి, హైదరాబాద్ నుంచి ప్రయాణం
- తిరుపతి విమానాశ్రయానికి రప్పించేందుకు ప్రయత్నం

రాజంపేట : రాయలసీమలో ప్రధానంగా ఉభయ జిల్లాల నుంచి ఎడారి దేశాలకు వెళ్లే వారి సంఖ్య లక్షల్లో ఉంటుంది. రాజంపేట, రాయచోటి, కడప, బద్వేలు, రైల్వేకోడూరుతోపాటు ఉభయ జిల్లాలోని పలు నియోజకవర్గాల నుంచి 2 లక్షల మందికి పైగా ఎడారి దేశాలపై ఆధారపడి జీవిస్తున్నారు. నాలుగు దశాబ్దాలుగా కువైట్, ఖతార్, దుబాయ్, సౌదీ అరేబియా, బహ్రెయిన్, అబుదాబీ, లెబనాన్, మస్కట్ దేశాలకు ప్రయాణాలు సాగిస్తూనే ఉన్నారు. మరింతమంది ఉద్యోగం, విద్య రీత్యా అమెరికా, కెనడా, సౌత్ ఆఫ్రికా, శ్రీలంక, ఆస్ట్రేలియా, ఇతర దేశాలకు వెళ్తున్నారు. వీరు విదేశీ యానం చేయాల్సి వస్తే భాష రాని వివిధ రాష్ట్రాలలోని విమానాశ్రయాల వద్ద ఇబ్బంది పడుతున్నారు. గల్ఫ్ దేశాలకు వెళ్లే వారిలో 60 శాతం మంది చదువు రాని వారు ఉండడంతో మోసాల పాలై జైళ్లలో మగ్గుతున్నారు.

గల్ఫ్ దేశాలకు విమానాలు ఎప్పుడో?

గల్ఫ్ దేశాలకు వెళ్లే వారు నాలుగు దశాబ్దాల కిందట వారాలకొద్దీ సముద్రయానం చేసి ఎడారి దేశాలకు చేరుకునేవారు. గల్ఫ్ దేశాలలో పనిచేస్తే ఖరీదైన జీవితం సాగించవచ్చునని, తమ కుటుంబాలు ఆర్థికంగా బలోపేతం కావచ్చునని తెలియడంతో అనంతరం ప్రయాణం చేసే వారి సంఖ్య పెరిగింది. వీరంతా విమానాలపై ఆధారపడుతున్నారు. ఇది గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం, ఏపీఏడీసీఎల్(ఆంధ్రప్రదేశ్ ఎయిర్‌పోర్టు డెవలప్‌మెంట్ కార్పోరేషన్ లిమిటెడ్) అంతర్జాతీయ సర్వీసులు తీసుకొచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నాయి. తిరుపతి, రాజంపేట లోక్‌సభ సభ్యులు తమ వంతుగా విమానాలను రన్‌వే మీదకు తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం తిరుపతి నుంచి విదేశీయానంపై ప్రత్యేక దృష్టి సారించారు. అయితే ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వం కనికరించడం లేదు.



తిరుపతి ఎయిర్‌పోర్టు

వ్యయప్రయాసలతో ప్రయాణం

చెన్నై, కర్ణాటక, ముంబయి, హైదరాబాద్, ఢిల్లీ నగరాలకు వెళ్లే వారు వ్యయ ప్రయాసలతో దూర ప్రాంతాల నుంచి వెళ్లాల్సి వస్తోంది. అనేక మంది బాష రాక ఇబ్బందిపడుతున్నారు. కొందరైతే మోసపోతున్నారు. దూర ప్రయాణంతో అనేక అవాంతరాలు ఎదురై ప్రమాదాల బారిన పడుతున్నారు. అంతేగాక విమాన టికెట్‌తోపాటు ఎయిర్‌పోర్టుకు చేరుకునే ఖర్చులు భరించాలంటే కష్టపడుతున్నారు. 2015లో తిరుపతి విమానాశ్రయానికి అంతర్జాతీయ హోదా కల్పించారు. కానీ ఆ స్థాయిలో కేంద్రప్రభుత్వం విమానాలను తీసుకురాలేదనే అపవాదు ఉంది.

విదేశీ విమాన సర్వీసులను ప్రవేశపెట్టాలి



రాయలసీమ జిల్లా వాసులకు అందుబాటులో ఉండే తిరుపతి ఎయిర్‌పోర్టు నుంచి విదేశీ విమాన సర్వీసులను ప్రవేశపెట్టాలి. ఆ దిశగా కేంద్ర ప్రభుత్వం అడుగులు వేయాలి. ఇప్పటికే వైఎస్సార్‌సీపీ ఎంపీలు తమ వంతు కృషి చేస్తున్నారు. ఉభయ జిల్లాల నుంచి విదేశాలకు వెళ్లాలంటే ఇతర రాష్ట్రాల వైపు చూడాల్సి వస్తోంది. త్వరలో విదేశీయానం సులభతరం చేసే బాధ్యత కేంద్రంపై ఉంది.

- చొప్పా అభిషేక్‌రెడ్డి, ఈడీ, ఏఐటీఎస్, రాజంపేట

గల్ఫ్ విమాన సర్వీసులు తీసుకురావాలి



తిరుపతి నుంచే గల్ఫ్ విమానాల సర్వీసులు అందుబాటులోకి తీసుకురావాల్సి ఉంది. నిత్యం వందలాది మంది ఇతర రాష్ట్రాలలోని ఎయిర్‌పోర్టుల ద్వారా రాకపోకలు సాగిస్తున్నారు. తిరుపతి ఎంపీ గురుమూర్తి, రాజంపేట ఎంపీ పీవీ.మిథున్‌రెడ్డి విదేశీ విమానసర్వీసులను తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నారు.

- గోవిందనాగరాజు, గల్ఫ్‌కో-కన్వీనర్, రాజంపేట

ప్రమాదంలో మహిళ మృతి

పెండ్లిమర్రి : యోగి వేమన యూనివర్సిటీ బైపాస్ సమీపంలోని ఎగువపల్లె క్రాస్ రోడ్డు వద్ద బుధవారం రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న సంఘటనలో కడపకు చెందిన విజయలక్ష్మి(30) మృతిచెందారు. పోలీసుల కథనం మేరకు..

కడప ఆకులవీధికి చెందిన ప్రసన్నకుమార్, జయలక్ష్మి ద్విచక్ర వాహనంలో ఎగువపల్లె గ్రామానికి వెళ్తుండగా, ఎగువపల్లె క్రాస్ రోడ్డు వద్ద వేంపల్లె నుంచి కడప వైపు వస్తున్న మరో ద్విచక్ర వాహనదారుడు అదుపు తప్పి ఢీకొనడంతో విజయలక్ష్మికి తీవ్ర గాయాలయ్యాయి. 108 వాహనంలో కడప అసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ విజయలక్ష్మి మృతిచెందింది. ప్రసన్న కుమార్‌కు గాయాలయ్యాయి. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అభివృద్ధి పథంలో సహకార బ్యాంకులు

సిద్దవటం : రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన సంస్కరణలతో జిల్లాలోని 13 సహకార బ్యాంకులు అభివృద్ధి పథంలో నడుస్తున్నాయని డీసీసీబీ చైర్మన్ మల్లెల ఝాన్సీరాణి తెలిపారు. సిద్దవటం ప్రాథమిక సహకార పరపతి సంఘంలో పనిచేస్తూ రామ్మోహన్‌రెడ్డి ఇటీవల మృతి చెందారు. దీంతో ఆయన సతీమణి లక్ష్మీదేవికి రూ.4,24,057ల చెక్కు, ఉద్యోగ ఉత్తర్వులను బుధవారం ఆమె అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చొరవతో 30 సంవత్సరాల తరువాత బ్యాంకులు, సొసైటీలు లాభాల బాటలో పయనిస్తున్నాయన్నారు. రైతులకు అతి తక్కువ వడ్డీతో రుణాలు మంజూరు చేయడం జరుగుతోందన్నారు. రైతులు చెల్లించే పైకానికి తప్పనిసరిగా రసీదులు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఈఓ కె.రాజేంద్రకుమార్, డీసీసీ బ్యాంకు మేనేజర్ సుచిత్ర, సింగిల్ విండో అధ్యక్షుడు జగదీష్‌కుమార్‌రెడ్డి, డైరెక్టర్ ఖాజీపీరాన్, సొసైటీ ఉద్యోగి శుకూర్, మాజీ ఎంపీపీ నరసింహారెడ్డి, బాలిరెడ్డి, రవిశేఖర్‌రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



రామ్మోహన్‌రెడ్డి సతీమణి లక్ష్మీదేవికి చెక్కు, ఉద్యోగ ఉత్తర్వులను అందజేస్తున్న డీసీసీబి చైర్మన్ మల్లెల ఝాన్సీరాణి

వెంకటాయపల్లెలో విష జ్వరాలు

సిద్దవటం: మండలంలోని వెంకటాయపల్లె గ్రామంలో విష జ్వరాలు ప్రబలుతున్నాయి. జనం జ్వరంతో వణికిపోతున్నారు. ఒకే కుటుంబానికి చెందిన సుబ్బరాయుడు, వెంకటసుబ్బయ్య, రాజీ, వెంకటసుబ్బమ్మ, రమణ, ప్రణవిలు జ్వరంతో మంచంపట్టారు. మరింత మంది కడప ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయించినట్లు స్థానికులు తెలిపారు. ఈ సమాచారం తెలుసుకున్న పి.కొత్తపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది బుధవారం గ్రామానికి వెళ్లి జ్వరంతో బాధపడుతున్న వారి రక్త నమూనాలు సేకరించారు. నివేదిక వచ్చిన అనంతరం అందరికీ పరీక్షలు నిర్వహిస్తామని వైద్య సిబ్బంది తెలిపారు.



వెంకటాయపల్లెలో జ్వర పీడితుల నుంచి రక్త నమూనాలు సేకరిస్తున్న వైద్య సిబ్బంది

ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు మృతి

ప్రొద్దుటూరు క్రైం : జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు బుధవారం అనారోగ్యంతో మృతి చెందారు. 42ఏళ్ల కలిగిన ఓ వ్యక్తి ఈ నెల 24న అనారోగ్యంతో ఆస్పత్రిలోని జీఈ వార్డులో చేరాడు. ఆరోగ్యం క్షీణించడంతో బుధవారం మృతి చెందాడు. మాట్లాడలేని స్థితిలో ఉండడంతో అతని వివరాలు తెలియలేదు. 60 ఏళ్ల వయసు కలిగిన మరో గుర్తు తెలియని వృద్ధుడు తీవ్ర అనారోగ్యంపాలై ఈ నెల 22న జిల్లా ఆస్పత్రిలో చేరాడు. చికిత్స పొందుతున్న అతను మృతి చెందాడు. ఇరువురి మృతదేహాలను ఆస్పత్రిలోని మార్చురీలో ఉంచారు. బంధువులు, కుటుంబ సభ్యులు ఆస్పత్రిలోని ఔట్‌పోస్టులో సంప్రదించాలని అధికారులు కోరారు.





దళితులు, ముస్లిం ఓట్ల తొలగింపునకు కుట్ర

రాజంపేట : నియోజకవర్గంలో పెద్ద ఎత్తున ముస్లిం, దళితుల ఓట్లు తొలగించేందుకు పచ్చ నేతలు కుట్ర పన్నుతున్నారని జిల్లా వక్ఫ్ బోర్డు కార్యదర్శి సయ్యద్ అమీర్ ఆరోపించారు. ఆర్డీవో రామకృష్ణారెడ్డిని నందలూరు తహసీల్దారు కార్యాలయంలో బుధవారం కలిసిన ఆయన వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజంపేట, నందలూరు, వీరబల్లి, సుండుపల్లె, సిద్దవటం, ఒంటిమిట్ట ప్రాంతాల్లో ముస్లింలు, దళితులు జీవనోపాధి కోసం గల్ఫ్ దేశాలకు వెళ్లారన్నారు. పచ్చ నేతలు గుర్తించి వారి ఓట్లను తొలగించాలని మండల రెవెన్యూ అధికారులపై ఒత్తిడి తీసుకువస్తున్నారన్నారు. గల్ఫ్ దేశాల్లో ఉన్న.. వారి ఆధార్ సంఖ్యలను అనుసంధానం చేసి ఓటు హక్కు కల్పించాలని కోరారు. ఓట్లు తొలగించాలనే పచ్చ నేతల కుట్రలను తిప్పికొడతామన్నారు.ఆయనతో పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.



ఆర్డీవో రామకృష్ణారెడ్డికి ఫిర్యాదు చేస్తున్న జిల్లా వక్ఫ్ బోర్డు కార్యదర్శి సయ్యద్ అమీర్

ఎఫ్‌బీఓ సస్పెన్షన్

ప్రొద్దుటూరు క్రైం : ప్రొద్దుటూరు ఫారెస్ట్ బీట్‌లో పని చేస్తున్న ఎఫ్‌బీఓను అధికారులు సస్పెండ్ చేశారు. తన బీట్ పరిధిలోని బృందావనం కాలనీ సమీపంలో అటవీ శాఖకు సంబంధించిన ప్రహరీపై ప్రైవేట్ వ్యక్తులు గోడ నిర్మించిన వ్యవహారంలో ఉన్నతాధికారులు వేటు వేసినట్లు తెలుస్తోంది.

ప్రొద్దుటూరులో.. తనిఖీలు

ప్రొద్దుటూరు క్రైం : ప్రొద్దుటూరు గాంధీరోడ్డులోని బాషా ట్రేడర్స్, ఖాదర్‌బాద్‌లోని ఆస్మా ప్లాస్టిక్ స్క్రాప్ దుకాణాల్లో కడప జీఎస్‌టీ స్టేట్ ట్యాక్స్ అధికారులు, లీగల్ మెట్రాలజీ అధికారులు బుధవారం తనిఖీలు నిర్వహించారు. దస్త్రాల్లో వివరాలు రాయలేదని నిర్ధారించామని, మరిన్ని లోపాలు గుర్తించి ఉన్నతాధికారులకు పంపుతున్నామని అధికారులు తెలిపారు. ఈ దాడుల్లో విజిలెన్స్ అధికారులు ఈదురుబాషా, శ్రీనివాసులు, కేవీ.కిశోర్, ఎం నాగన్న, లీగల్ మెట్రాలజీ అధికారి ఎంవీ.రమేష్‌కుమార్ రెడ్డి, కృష్ణానాయక్, రంతుబాషా పాల్గొన్నారు.



స్క్రాప్ దుకాణంలో తనిఖీలు నిర్వహిస్తున్న విజిలెన్స్ అధికారులు

4.5 కిలోల గంజాయి స్వాధీనం

మదనపల్లె : మదనపల్లె తాలూకా పోలీస్ స్టేషన్ పరిధిలో 4.5 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్లు డీఎస్పీ కేశప్ప తెలిపారు. స్థానిక టూటౌన్ పోలీసు స్టేషన్‌లో కేసు వివరాలను ఆయన వెల్లడించారు. జిల్లా ఎస్పీ ఆర్.గంగాధరరావు ఆదేశాల మేరకు మదనపల్లె డివిజన్‌లో గంజాయి వినియోగం, రవాణాపై ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. ఈ నెల 29వ తేదీన సీటీఎం రైల్వేస్టేషన్ వద్ద గంజాయి విక్రయాలపై దాడి చేయగా నలుగురు యువకులు అనుమానస్పదంగా కనిపించారన్నారు. అదుపులోకి తీసుకునేందుకు ప్రయత్నించగా సీటీఎం గ్రామానికి చెందిన ఉమాశంకర్(21), ఉదయకిరణ్(21), హరినాథ్(21) పట్టుబడగా ప్రకాష్ పరారయ్యారని తెలిపారు. వారి వద్ద రూ.30 వేల విలువగల 4.5 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నామన్నారు. ఎన్‌డీపీఎస్ యాక్టు మేరకు కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపడం జరిగిందన్నారు. నిందితులు గంజాయి వినియోగానికి అలవాటు పడి, తక్కువ ధరకు గంజాయిని ఏజెన్సీ ప్రాంతాలైన నర్సీపట్నం నుంచి కొనుగోలు చేసి సీటీఎం గ్రామానికి తెస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో తాలూకా సీఐ సత్యనారాయణ, వన్‌టౌన్ సీఐ మహబూబ్‌బాషా, ఎస్ఐ హేమాద్రి పాల్గొన్నారు.



స్వాధీనం చేసుకున్న గంజాయిని చూపుతున్న డిఎస్పీ కేశప్ప, సీఐలు

చేనేతకు ఆప్కో చేయూత

కడప కోటిరెడ్డి సర్కిల్ : చేనేతల అభివృద్ధికి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం కృషి చేస్తోంది. చేనేత కార్మికులకు అండగా నిలబడి ఇప్పటికే వైఎస్సార్ నేతన్న నేస్తం పథకం కింద ఏటా రూ.24000 అందిస్తుండగా, తాజాగా ప్రభుత్వ ఉద్యోగులు, వినియోగదారులకు వేర్వేరుగా ఆప్కో ద్వారా రాయితీలు ఇచ్చేందుకు రెండు ప్రత్యేక పథకాలను ప్రభుత్వం ప్రవేశపెట్టింది.

కడప జిల్లాలోని దిశ పోలీస్ స్టేషన్, కలెక్టరేట్ కార్యాలయం, పులివెందుల, రాయచోటి, రాజంపేట, రైల్వేకోడూరు పట్టణాల్లో ఆప్కో కేంద్రాలున్నాయి. వీటిలో వసతుల కల్పనతో ఆప్కో వస్త్ర విక్రయాలు పెంచేందుకు ప్రభుత్వం ప్రత్యేక పథకాలను అందుబాటులోకి తెచ్చింది. ప్రభుత్వ ఉద్యోగులకు ప్రత్యేకంగా పథకం అందుబాటులోకి తెచ్చింది. తొలి శ్లాబ్‌లో కార్యాలయ సహాయకుడి నుంచి సహాయ సంచాలకులు రూ.25 వేల వరకు, రెండో శ్లాబ్‌లో ఉప సంచాలకుల నుంచి ఆ పైస్థాయి ఉద్యోగులంతా రూ.50 వేల వరకు చేనేత వస్త్రాలు కొనుగోలు చేసుకునే వెసలుబాటు కల్పిస్తోంది. ఐదు సమాన వాయిదాలలో ఆప్కోకు చెల్లించాల్సి ఉంటుంది. ఇందుకోసం ప్రభుత్వ ఉద్యోగులు తమ వివరాలతోపాటు ఐదు నెలల్లో కంతులు చెల్లించే విధంగా తమ ఉన్నతాధికారి నుంచి అంగీకార పత్రం సమర్పించాల్సి ఉంటుంది. రూ.10వేలకు తక్కువ కాకుండా కొనుగోలు చేస్తే ఆ వస్త్రాల కొనుగోలుపై 30 శాతం డిస్కౌంట్ వర్తిస్తుంది.



ఆప్కో షోరూం

చెల్లింపులతో.. రాయితీలు

ఆప్కో మరోపథకం అమలులోకి తెచ్చింది. వినియోగదారుడు ప్రతినెలా కొంత మొత్తం చెల్లిస్తే ఆప్కో ద్వారా సొమ్ము జమచేయడం, 30 శాతం వరకు రాయితీ ఇవ్వడం వంటివి ఈ పథకం కింద వర్తిస్తాయి. ఉదాహరణకు ప్రతి నెలా వినియోగదారుడు రూ.1000 చొప్పున పొదుపు చేస్తే.. 11 నెలలకు రూ.11వేలు చెల్లిస్తారు. 12వ నెల ఆ మొత్తం ఆప్కో చెల్లిస్తుంది. ఆ రూ.12వేలతో అతడు వస్త్రాలు కొనుగోలు చేయవచ్చు. అంతేగా వాటిపై 30 శాతం రాయితీ లభిస్తుంది. వాయిదాలను సకాలంలో పూర్తి చేస్తేనే ఈ సౌకర్యం లభిస్తుంది. జీఎస్టీ ఛార్జీలు అదనంగా ఉంటాయి. ఈపథకం కింద వినియోగదారులు తమ ఆధార్, ఇతర వివరాలతో సభ్యత్వం నమోదు చేయించుకోవాలి.

సద్వినియోగం చేసుకోవాలి

సులభ వాయిదా పద్ధతిలో ఆప్కో చేనేత వస్త్రాల కొనుగోలు పథకాన్ని ప్రవేశ పెడుతున్నాం. రాష్ట్ర ప్రభుత్వం పొదుపు పథకం, ప్రభుత్వ ఉద్యోగుల పొదుపు పథకాన్ని ప్రవేశపెట్టింది. ప్రజల్లో చేనేత వస్త్రాల వినియోగాన్ని పెంపొందించాలనే ఉద్దేశంతో ఈ రెండు పథకాలను అమలు చేస్తోంది. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.


- వరప్రసాద్, ఆప్కో డీఎం, కడప

ఆస్తి పంచి ఇవ్వలేదని తల్లిపై దాడి

మదనపల్లె : ఆస్తి పంచి ఇవ్వలేదని తల్లిపై కన్న కొడుకు దాడి చేసిన సంఘటన మదనపల్లె మండలంలో బుధవారం జరిగింది. సీటీఎం గ్రామానికి చెందిన వి.సత్యనారాయణ భార్య వి.రాజమ్మ(65)కు ఇద్దరు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు. రాజమ్మకు వారసత్వంగా సంక్రమించిన 6.5 ఎకరాల వ్యవసాయ పొలం ఉంది. ఆమె కుమారుడు బాలాజీ వ్యసనాలకు బానిసగా మారి.. కొంత కాలంగా ఆస్తి పంచి ఇవ్వాలంటూ తల్లిదండ్రులతో గొడవపడుతున్నారు. అనారోగ్యానికి గురై తండ్రి సత్యనారాయణ ఆరు నెలల కిందట మృతి చెందాడు. బుధవారం మద్యం మత్తులో మరోసారి ఆస్తి పంచాలంటూ తల్లి రాజమ్మతో గొడవపడ్డాడు. ఆవేశంతో కుర్చీతో ఆమె తలపై బాదడంతో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు బాధితురాలిని మదనపల్లె జిల్లా ఆస్పతికి తరలించారు. తాలూకా పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ద్విచక్ర వాహనం బోల్తా: ఒకరికి గాయాలు

సిద్దవటం : మండలంలోని జేఎంజే కళాశాల సమీపంలో ద్విచక్ర వాహనం అదుపు తప్పి కింద పడడంతో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. రాజంపేట మండలం తుమ్మల అగ్రహారం గ్రామానికి చెందిన ఎలక్ట్రీషియన్ పెంచలయ్య కడపకు ద్విచక్ర వాహనంలో బయలుదేరారు. జేఎంజే కళాశాల సమీపంలో వాహనం అదుపుతప్పి బోల్తా పడడతో తీవ్రగాయాలయ్యాయి. ప్రయాణికులు 108 సాయంతో కడప రిమ్స్ ఆసుపత్రికి తరలించారు.



గాయపడిన పెంచలయ్య